
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 18 । అక్టోబర్ । 2025



సోమశిలలో 73.807 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 73.807 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 15,750 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 10,150, ఉత్తరకాలువకు 50, కండలేరుకు 3600 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,34,290
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.12,092
మూడు శాతం జీఎస్టీతో	రూ.12,455
నవర (8 గ్రాములు)	రూ.99,640

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.7 /25.2

జిల్లాలో శనివారం అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురుస్తాయని, పిడుగులు పడుతాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. శుక్రవారం గాలిలో తేమ 89 శాతంగా ఉంది.

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 30 కంపార్టుమెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,521 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 25,101 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.66 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని, ముందుగా వెళ్తే అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

బీఎస్ఎన్ఎల్ దీపావళి ఆఫర్లు

నెల్లూరురూరల్: బీఎస్ఎన్ఎల్ కొత్త వినియోగదారులకు దీపావళి పండగ సందర్భంగా కానుక ప్రకటించిందని ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ అమరేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్యాకేజీలో రూ.1కే సిమ్, అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 2.5 జీబీ హైస్పీడ్ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు ఉపయోగించుకోవచ్చు అని తెలిపారు. ఈ సిమ్ కోసం ఆధార్ ధ్రువీకరణతో దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్, రిటైలర్ వద్దకు గాని లేదా డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్లను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశం నవంబరు 15 వరకు కొనసాగుతుందన్నారు.

రెవెన్యూ జోన్-3 క్రీడలు వాయిదా

నెల్లూరు (అర్బన్): ప్రతిష్టాత్మకంగా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో ఒంగోలులో జరగాల్సిన జోన్-3 (నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు) క్రీడలను వర్షాల నేపథ్యంలో ఈ నెల 23, 24 తేదీలకు వాయిదా వేశామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, అమరావతి జేఏసీ చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి శుక్రవారం నెల్లూరులో ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మూడేళ్లకు ఒక దఫా రెవెన్యూ క్రీడలను అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుతున్నామన్నారు. జోన్ల స్థాయిలో పోటీలు పూర్తి చేసుకుని వచ్చే నెల 7 నుంచి 3 రోజులపాటు అనంతపురంలో రాష్ట్ర స్థాయి పోటీలను అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహిస్తామన్నారు. రెవెన్యూ ఉద్యోగులు క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

సంగం తహసీల్దార్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి



సోమ్లానాయక్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

సంగం: రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ జాబితాలో ఉన్న సంగం తహసీల్దార్ సోమ్లానాయక్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. దీంతో శుక్రవారం కార్యాలయంలో సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సోమ్లానాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ సల్మా, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితో వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన

- జేసీ ఎం. వెంకటేశ్వర్లు



నెల్లూరురూరల్: సమష్టి కృషితోనే వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన సాధ్యమని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఇప్పటి వరకు వెట్టిచాకిరీ నిర్మూలన, ప్రయత్నాయ ఉపాధి, పునరావాస కల్పనకు తీసుకున్న చర్యలను డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సీహెచ్ విజయ్‌కుమార్‌రెడ్డి కమిటీ సభ్యులకు వివరించారు. జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఇటుక బట్టీలు, పరిశ్రమలు, వ్యాపార దుకాణాలు, రొయ్యలు, చేపల గుంతలు, రైసు మిల్లులు, హోటళ్ల మొదలైన ప్రదేశాల్లో కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు చేసి వెట్టిచాకిరి బాధితులను గుర్తించాలన్నారు. విముక్తి పొందిన బాలురకు ఒక సర్టిఫికెట్ అందించి పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలతో తోడ్పాటు అందిస్తున్నాయని వివరించారు. సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, డీఎంహెచ్ఓ సుజాత, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి, ఏఎస్ఐ వైశ్రీహరి, సభ్యులు బషీర్, సుదర్శన్, దాసరి పోలయ్య, సత్యవతమ్మ, పాపయ్య పాల్గొన్నారు.



పెరుమాళ్లపాడు నుంచి పెన్నానదిలోకి నిర్మించిన గ్రావెల్ రోడ్డు

ఉపాధి నిధులు.. తమ్ముళ్ల భోజ్యం

టీడీపీ నేతలు బరి తెగించారు. ప్రజాధనాన్ని దోచుకునేందుకు అధికార పార్టీ నేతల అండ చూసుకుని అధికార యంత్రాంగం అనుమతులిచ్చింది. తమ్ముళ్ల దోపిడీలో రెట్టింపు స్థాయిలో ముడుపులు పుచ్చుకుని అడ్డగోలుగా నిధులు, బిల్లులు మంజూరు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర పర్యావరణ శాఖ అనుమతిలేకుండా నదిలోకి పక్కా రోడ్డు నిర్మాణం చేయకూడదనే నిబంధనలను ధిక్కరించి అనుమతులిచ్చారు. ఉపాధి హామీ పథకంలో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి అనుమతుల్లేవు. అయినా ముందుగా అనుమతులు తీసుకోలేదు. అంచనాలు రూపొందించలేదు. వాళ్ల అవసరాలకు రోడ్డు నిర్మాణం చేసుకున్నారు. ఉపాధి నిధులను దోచుకునేందుకు ఈ రోడ్డు నిర్మాణాన్ని ఇందులో చేర్చి రూ.లక్షల ప్రజాధనాన్ని కాజేశారు. ఉపాధి చట్టం ప్రకారం దుర్వినియోగం చేసిన ఈ నిధులను అనుమతులిచ్చి, బిల్లులు చెల్లించిన సంబంధిత అధికారుల వేతనాల్లో నుంచి రికవరీ చేయాల్సి ఉంటుంది.

- రూ.14.65 లక్షతో పెన్నానదిలోకి గ్రావెల్ రోడ్డు
- అడ్డగోలుగా అనుమతి!, బిల్లులు చెల్లింపు?
- రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పన టీడీపీ నేతలు
- ఈ పథకంలో గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి అనుమతే లేదు
- ఇందులో 90 శాతం మెటీరియల్ కాంపొనెంట్, 10 శాతం కూలీల ఖర్చు
- దోపిడీలో అధికారుల వాటా ఎంత?
- సీసీ రోడ్లకు మాత్రమే మెటీరియల్ కాంపొనెంట్‌కు నిధులు
- అదీ 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్‌కు అనుమతి ఇవ్వొచ్చు
- ఉపాధి హామీ పథకం కూలీలకు పనులు కల్పించడానికే..
- కానీ టీడీపీ నేతలు దోపిడీ పథకంగా మార్చుకున్నారు
- పర్యావరణ నిబంధనలు ధిక్కరించి నదిలోకి రోడ్డు నిర్మాణానికి అనుమతించడం పరాకాష్ట





రోడ్డు నిర్మాణానికి తరలించిన గ్రావెల్



ఇసుక రవాణా కలెక్షన్ కోసం ఏర్పాటు చేసుకున్న ఏసీ కంటైనర్

నెల్లూరు (పొగతోట): టీడీపీ నేతలు ఉపాధిని దోపిడీ పథకంగా మార్చుకున్నారు. మంత్రి 'ఆనం' అండతో పర్యావరణ నిబంధనలు ధిక్కరించి నదిలోకి గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. వాస్తవానికి ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు గ్రావెల్ రోడ్లకు అనుమతులివ్వడం లేదు. అయితే అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు చట్టాలు.. మాకు చుట్టాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ఏ రోడ్డు నిర్మాణమైనా ముందుగా ఉపాధి గ్రామ సభ పెట్టి అవసరమైన పనులను గుర్తించాల్సి ఉంది. వీటికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనుమతులు తీసుకున్నాకే పనులు చేయాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా ముందుగా అనుమతులు తీసుకోలేదు. అంచనాలు రూపొందించలేదు. వాళ్ల అవసరాలకు రోడ్డు నిర్మాణం చేసుకున్నారు. ఆ తర్వాత ఎస్టిమేషన్లు, అనుమతులు లేకుండానే బిల్లులు తీసుకున్నారు.

కిలోమీటర్ రోడ్డుకు రూ.14.65 లక్షలా?

అప్పారావుపాళెం బ్రిడ్జి నుంచి పెరుమాళ్లపాడు ఇసుక రీచ్ వరకు కి.మీ. దూరం కంటే తక్కువే ఉంటుంది. వాస్తవానికి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి కిలోమీటరుకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు మించి ఎస్టిమేషన్ వేయలేని ఇంజినీరింగ్ శాఖల అధికారులు చెబుతున్నారు. అయితే ఇందుకు భిన్నంగా రూ.14.65 లక్షలకు బిల్లులు పెట్టడం, డ్వామా అధికారులు బిల్లులు పాస్ చేయడం చూస్తే ప్రజాధనం దోపిడీలో వీరి వాటా భారీ మొత్తంలోనే ఉంటుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రావెల్ రోడ్లకు అనుమతులు ఇవ్వకూడదు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేవలం శ్రామికులకు పనులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. శ్రామికులు చేసిన పనుల ద్వారా మెటీరియల్ కాంపొనెంట్ పనులు చేసుకునే అవకాశం ఉంటుంది. శ్రామికులు చేసిన పనుల ద్వారా రూ.వందల కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఇతర భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో కూడా 60 శాతం కూలీలకు, 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్‌కు చెల్లించాల్సి ఉంటుంది. అయితే పెరుమాళ్లపాడులో మంజూరు చేసిన గ్రావెల్ రోడ్డుకు 90 శాతం మెటీరియల్, 10 శాతం శ్రామికులకు పనులు కల్పించేలా అధికారులు పనులు అనుమతులిచ్చారు.

ప్రజలకు ఉపయోగపడని రోడ్డు

ఉపాధి హామీ పథకంలో నిర్మించిన చేపట్టే ఏ పనులైనా ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేదిలా ఉండాలి. కానీ ప్రజలకు ఉపయోగం లేకుండా, శ్రామికులకు పనులు లేకుండా గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేశారు. రూ.14.65 లక్షలు ప్రజాధనం దుర్వినియోగం అయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవ ఖర్చును పరిగణలోకి తీసుకున్నప్పటికీ రూ.11.65 లక్షల అప్పనంగా తమ్ముళ్లు దోచుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ పథకం టీడీపీ నాయకులకు అక్షయ పాత్రగా మారింది. గ్రావెల్ రోడ్డు, పంట కుంటలు, గోకులాల పేరుతో ఉపాధి నిధులు స్వాహా చేస్తున్నారు. 2019 ఏడాదికి ముందు చేసిన గోకులాల చూపించి ప్రస్తుతం నిధులు స్వాహా చేస్తున్నారు.

రీచ్‌కు, రోడ్డుకు ఎన్‌జీటీ అనుమతుల్లేవ్

రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పెరుమాళ్లపాడు ఇసుక రీచ్‌కు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతే లేదు. అసలు నదిలోకి పక్కా రహదారిని నిర్మించాలంటే ఎన్‌జీటీ అనుమతి తీసుకోవాల్సి ఉంది. ఇవేవి లేకపోయినప్పటికీ అధికార మదంతో టీడీపీ నేతలు విచ్చలవిడిగా రీచ్ నుంచి ఇసుక తవ్వి అక్రమంగా రవాణాకు వీలుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి తెగించారు. నిర్మాణం పూర్తయ్యాక.. కొత్తగా నిర్మాణం చేపడుతున్నామంటూ జిల్లా అధికారులతో సంబంధం లేకుండా రాష్ట్ర అధికారుల నుంచి అనుమతులు మంజూరు చేయించుకున్నారు.

గ్రావెల్ రోడ్లకు అనుమతులు ఇవ్వడం లేదు

ఉపాధి హామీ పథకంలో గ్రావెల్ రోడ్లకు ఎక్కడా అనుమతులివ్వడం లేదు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, భవన నిర్మాణాలకు మాత్రమే అనుమతులిచ్చాం. శ్రామికులకు పనులు కల్పించడంమే ఉపాధి పథకం అసలు లక్ష్యం. ఆ మేరకే చర్యలు చేపడుతున్నాం. పెరుమాళ్లపాడు గ్రావెల్ రోడ్డుకు తామెవరూ అనుమతులివ్వలేదు. రాష్ట్ర అధికారులు అనుమతి ఇచ్చారు.

– డ్వామా పీడీ గంగాభవాని

గ్రావెల్ రోడ్డులో దోపిడీ ఎంత?

దూరం	అంచనా
కిలోమీటరు	రూ.3 లక్షల
కేటాయించింది	రూ.14.65 లక్షలు
దోపిడీ	రూ.11.65 లక్షలు

కలెక్టర్ సార్.. ఇటు చూడండి

అధికార పార్టీ నేతలు ప్రజాధనాన్ని దోచుకుంటుంటే.. మీ అధికార యంత్రాంగం ఏ విధంగా సాగిలపడి నిధులు, బిల్లులు మంజూరు చేస్తోందో ఒక్కసారి పరిశీలించాలంటూ స్థానికులు కోరుతున్నారు. తమ కాలనీల్లో రోడ్లు లేక.. ఏళ్ల తరబడి అష్టకష్టాలు పడుతుంటే.. కనీసం తట్టడు మట్టి కూడా వేయని పాలకులు.. ఏకంగా ప్రజల సొమ్మును అప్పనంగా దోచుకుంటున్నారని మండిపడుతున్నారు. పెన్నానదిలోకి రోడ్డు నిర్మాణం చేపట్టాలంటే ఉన్న నిబంధనలను, ఉపాధి పథకం నిబంధనలను పరిగణలోకి తీసుకుని ఇందుకు బాధ్యులైన టీడీపీ నేతలపై కేసులు నమోదు చేయడంతోపాటు నగదు రికవరీ చేయాల్సిన అవసరం ఉంది. అవినీతి పరులకు కొమ్ముకాసిన అధికారులపై శాఖపరమైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదులు చేసి వారిపై చర్యలు తీసుకునేందుకు పోరాటం చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న జర్నలిస్టుల ఐక్య సంఘాల నాయకులు

- 'సాక్షి' జర్నలిస్టులపై అక్రమ కేసులు దారుణం
- వాస్తవాలు రాస్తే వేధిస్తారా?
- అర్ధరాత్రి పోలీసుల ద్వారా నోటీసులిచ్చి భయభ్రాంతులకు గురి చేస్తారా?
- ప్రజాస్వామ్యానికి నాల్గో స్తంభం జర్నలిజం
- కలెక్టర్ హిమాన్షు శుక్లాకు జర్నలిస్టుల ఐక్యసంఘాల వేదిక వినతిపత్రం అందజేత

నెల్లూరురూరల్ : ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా 'సాక్షి' జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం, పత్రికా స్వేచ్ఛపై కక్ష పూరిత దాడులు చేయడం దారుణమని, జర్నలిస్టు సంఘాల ఐక్యవేదిక (జేఏసీ) నాయకులు దయాశంకర్, 'సాక్షి' టీవీ బ్యూరో ఇన్‌చార్జి లోకేశ్ అన్నారు. 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి, నెల్లూరు జిల్లా బ్యూరో ఇన్‌చార్జి సీహెచ్ మస్తాన్‌రెడ్డి, అర్ధరాత్రి పూట నోటీసులు, కలిగిరి రిపోర్టర్ ఇంట్లో సోదాలు చేయడం, వేధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు నిరసన నినాదాలు చేశారు. కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు వినతి పత్రం ఇచ్చారు. కలెక్టర్‌తో నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులకు పార్టీలతో సంబంధం ఉండదన్నారు. ప్రజా సమస్యలపై కథనాలు, వార్తలు మాత్రమే రాస్తారన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడమే జర్నలిస్టుల విధి అన్నారు. ఈనెల 8న నకిలీ మద్యానికి సంబంధించి స్థానికులు అనుకుంటున్న సమాచారాన్ని వార్త రూపంలో 'సాక్షి' ప్రచురించిందన్నారు. ఈ వార్తలో ఏమైనా అభ్యంతరాలున్నాయని భావిస్తే ఖండన పంపొచ్చని లేదా చట్టపరంగా చర్యలు చేపట్టవచ్చన్నారు. అయితే అందుకు విరుద్ధంగా ప్రజా సమస్యలను పరిష్కరించడం చేతకాని ప్రభుత్వం 'సాక్షి' పత్రిక బ్యూరో ఇన్‌చార్జ్ ఇంటికి అర్ధరాత్రి పూట పోలీసులను పంపి నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురి చేయడం. ఇళ్లలోని మహిళలను భయపడేలా చేయడం వంటి ఘటనలు చట్టానికి విరుద్ధంగా చేశారన్నారు. 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డికి కూడా అర్ధరాత్రి హైదరాబాద్‌లో నోటీసులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మాటి మాటికి విచారణ పేరుతో పోలీసుస్టేషన్‌కు పిలిపించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యానికి నాల్గో స్తంభం జర్నలిజం అనేది మరిచారా అంటూ నిగ్గదీశారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే కాకుండా వార్తలు రాయకుండా అక్రమ కేసులతో జర్నలిస్టులను భయపెట్టే ప్రయత్నం చేయడమేనని ఆరోపించారు. దీనిని తాము ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం తమ చర్యలు మానుకోకుంటే ఐక్య ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' బ్యూరో మస్తాన్‌రెడ్డి, 'సాక్షి' యోగానందరెడ్డి, సాంబశివ రావు, ధనలక్ష్మి, హజరత్తయ్య, కృష్ణారెడ్డి, శ్రీధర్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విచారణకు 'సాక్షి' బ్యూరో హాజరు

- సంఘీభావం తెలిపిన జర్నలిస్టులు

నెల్లూరు(క్రైమ్): 'సాక్షి' పత్రికలో వచ్చిన వార్త కథనాలపై నెల్లూరు రూరల్, కలిగిరి పోలీసుస్టేషన్లలో నమోదైన కేసుల్లో 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి సీహెచ్ మస్తాన్‌రెడ్డి శుక్రవారం పోలీసు విచారణకు హాజరయ్యారు. అత్యవసర పనుల దృష్ట్యా ఈ నెల 24న విచారణకు హాజరవుతానని ఆయన లిఖిత పూర్వకంగా నెల్లూరు రూరల్ ఎస్ఐ లక్ష్మణ్, కలిగిరి ఎస్ఐ ఉమాశంకర్‌లను కోరారు. అందుకు వారు సమ్మతించారు. జర్నలిస్టులు పెద్ద ఎత్తున నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్ వద్దకు చేరుకుని మస్తాన్‌రెడ్డికి సంఘీభావం ప్రకటించారు. 'సాక్షి' మీడియాపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలనీ, వేధింపులు ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల హక్కులను హరించడమే



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం డీటీ సంధ్యారాణికి వినతి పత్రం అందజేస్తున్న విలేకరులు

ఆత్మకూరు: ప్రజాస్వామ్య వ్యవస్థకు పత్రికారంగం ఓ స్తంభం. బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తూ ప్రభుత్వం ఎడిటర్లు, బ్యూరోలు, విలేకర్లపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని ఆత్మకూరు డివిజన్ పరిధిలోని విలేకరులు ఎలుగెత్తి చాటారు. 'సాక్షి' మీడియాపై ప్రభుత్వం కేసులు బనాయించడం, పోలీసులతో కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహిస్తుండడాన్ని నిరసిస్తూ ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద పలు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, విలేకర్లపై అక్రమ కేసులు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ డిప్యూటీ తహసీల్దారు సంధ్యారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరుతో పాటు రూరల్, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, అనంతసాగరం, మర్రిపాడు మండలాల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై పోరాటమే



మాట్లాడుతున్న కాకాణి పూజిత, చిత్రంలో మహిళా నేతలు

- ప్రభుత్వ పెద్దల భరోసాతో టీడీపీ నేతలు ఈ స్థాయిలో మద్యం తయారీ చేశారు
- 16 నెలలుగా నకిలీ మద్యం తయారవుతుంటే.. గుర్తించలేని గుడ్డి ప్రభుత్వం
- ఈ కేసును నీరుగార్చేందుకే సిట్ పేరుతో విచారణ
- సీబీఐ విచారణ జరిగితే నకిలీ మద్యం వెనుక ఎవరున్నారనేది నిగ్గుతేలుతుంది
- రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు కోల్పోతున్నా కూటమి ప్రభుత్వం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితులంతా ప్రభుత్వ పెద్దల వాటాదారులు కావడంతో మొక్కుబడిగా కేసులు నమోదు చేసి, టీడీపీ నేతలను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఈ కేసులో ప్రధాన పాత్రధారులను రక్షించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కుంభకోణాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం హాస్యాస్పదన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణం నకిలీ మద్యం కేసును సీబీఐతో విచారణ కోరకుండా, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని సిట్ అధికారులతో విచారణకు ఆదేశించి పక్కదారి పట్టిస్తున్నట్లు ప్రజల్లో అనుమానాలు ఉన్నాయన్నారు.

ప్రభుత్వ పెద్దల పాత్రే కీలకం

ఈ నకిలీ మద్యం తయారీలో ప్రభుత్వ పెద్దల పాత్ర కీలకంగా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. వీరి అనుమతి లేకుండానే ఈ స్థాయిలో మద్యం తయారు చేయడం అంటే సాధ్యం కాదన్నారు. 16 నెలలుగా నకిలీ మద్యం తయారు అవుతుంటే ఈ ప్రభుత్వం ఏమి చేస్తుందని నిలదీశారు. ప్రభుత్వ ఇంటెలిజెన్స్, నిఘా వర్గాలు, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు ఏమీ చేస్తున్నాయని నిలదీశారు. దీన్ని బట్టి అసమర్థ ప్రభుత్వమా?, గుడ్డి ప్రభుత్వమా? అని నిలదీశారు. గత ప్రభుత్వంలో అసలు జరగని మద్యం స్కామ్‌పై సిట్ విచారణ జరుగుతున్నా, కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ఎందుకు అరికట్టలేకపోతుందన్నారు.

డైవర్షన్ రాజకీయాలు

సిట్ విచారణ పేరుతో కేసులో సంబంధం లేని జోగి రమేష్‌పై కేసును ఆపాదించడం సరికాదని, కూటమి నేతలు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ, తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నకిలీ మద్యంపై వార్తలు రాసే మీడియాపై కూడా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. 'సాక్షి' మీడియా ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తూ, నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు ప్రయత్నిస్తుంటే, కూటమి ప్రభుత్వం పోలీసులను ఉపయోగించుకొని కేసులు పెట్టి, విచారణ పేరుతో నానా యాగి చేస్తున్నారు. రాజ్యాంగంలోని ప్రధాన పాత్ర పోషించే మీడియాపై కూటమి ప్రభుత్వ చర్యలను వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఖండిస్తుందన్నారు. ఈ ప్రభుత్వంలో గ్రామాల్లో నకిలీ మద్యం తయారీ ఒక కుటీర పరిశ్రమగా తయారైందన్నారు. నకిలీ మద్యం మన రాష్ట్రంలో తయారయ్యి పక్క రాష్ట్రాలకు కూడా సరఫరా చేస్తుంటే, ప్రభుత్వం ఎందుకు నిరోధించడానికి చర్యలు తీసుకోవడం లేదని, ప్రతి మద్యం షాపులో నాలుగు బాటిళ్లలో ఒక నకిలీ బాటిల్ అమ్ముతుంటే, అధికారులు ఎందుకు గుర్తించి, ప్రజల ప్రాణాలను కాపాడలేకున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ పాలనంతా, కక్ష సాధింపు చర్యలు, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం, దాడులు చేయించడంతో సరిపోయిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర జోనల్ విభాగం మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, నెల్లూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీ సునంద, నెల్లూరు నగర నియోజకవర్గ మహిళా అధ్యక్షురారాలు తనూజారెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్మీనగర్‌లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి వెండి వస్తువులు, టీవీని గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు బాలాజీ నగర్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో రవీంద్రశర్మ, వసంతలక్ష్మి దంపతులు నివాసముంటున్నారు. కుమారుడు, బంధువులు హైదరాబాద్‌లో ఉన్నారు. వారిని కలిసేందుకు ఈనెల మూడో తేదీన దంపతులు హైదరాబాద్‌కు వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి లోనికి ప్రవేశించారు. అర కేజీ వెండి వస్తువులు, ఒక టీవీని చోరీ చేశారు. శుక్రవారం ఇంటికొచ్చిన బాధితులు బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ఖాళీ మద్యం బాటిళ్లతో ఓ వ్యక్తి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించారు. విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటన నెల్లూరు త్యాగరాజనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. త్యాగరాజనగర్ మూడో వీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వి.కిశోర్‌కుమార్, అరుణ దంపతులు నివాసముంటున్నారు. వారికి ఎనిమిదేళ్ల వయసున్న కుమారుడు, ఏడేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. కిశోర్ జేసీబీ కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు దుండగులు అతని ఇంటికెళ్లారు. కిశోర్ తలుపు తీశారు. ముగ్గురూ లోనికెళ్లి చంపండిరా అంటూ తమ చేతిలో ఉన్న ఖాళీ మద్యం బాటిళ్లతో కిశోర్‌పై దాడిచేయడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. భార్య అనూష పెద్దగా కేకలు వేయడంతో నిందితులు పారిపోయారు. ఆమె స్థానికుల సహకారంతో భర్తను 108 అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిశోర్ ప్రస్తుతం మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాడు. కోలుకుంటే దాడికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్షం.. అన్నదాతలకు నష్టం



నేలవాలిన వరిపంట

సోమశిల: అనంతసాగరం మండలంలో కురిసిన వర్షాలతో వందల ఎకరాల్లో వరి పంట నేలవాలింది. పాతదేవరాయపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో చేతికొచ్చిన పంట నీట మునిగి నష్టం వాటిల్లినట్టు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి సాయం చేయాలని కోరుతున్నారు.

కండలేరులో 59.990 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 59.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,790 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,950, పిన్నేరు కాలువకు 500, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

కలువాయి(సైదాపురం): పాముకాటుకు ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కలువాయి మండలం మాదన్నగారిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దండు పెంచలయ్య (48) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అతను గురువారం రాత్రి బహిర్భూమికెళ్లి తిరిగి ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. నోటినుంచి నురగ రావడంతో కుటుంబ సభ్యులు గమనించి కలువాయిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్సై కోటయ్య కేసు నమోదు చేశారు.

20న కోనలో దీపావళి వేడుకలు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో 20వ తేదీ దీపావళి వేడుకలు నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు శుక్రవారం తెలిపారు. కోన పురవీధుల్లో రథోత్సవం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద నరకాసుర వధ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియజేశారు. ఉదయం 9 గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుదీర్చి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ : రూ.127
లేయర్ : రూ.118
బ్రాయిలర్ చికెన్ : రూ.230
స్కిన్‌లెస్ చికెన్ : రూ.254
లేయర్ చికెన్ : రూ.200

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

జీఎస్టీ ఫలాలు.. ప్రజలకు దూరం



నెల్లూరు జీవీ నగర్లో ఓ మందుల దుకాణంలో శ్రీనివాసులు అనే వ్యక్తి సుక్రాఫిల్ - ఏ సిరప్ బాటిల్స్ రెండు కొనుగోలు చేశాడు. దానికి సంబంధించిన రశీదు ఇది. ఒక్కో బాటిల్ ఎమ్మార్పీ రూ.315. రెండూ కలిపి కలిపి రూ.630 ఉంది. రశీదును పరిశీలిస్తే ఎమ్మార్పీ మాత్రమే ఉంది. జీఎస్టీ గురించి లేదు.



రవీంద్రచౌదరి అనే వ్యక్తి మినీబైపాస్ రోడ్డులోని ఓ మాల్లో ఒక లీటర్ పరిమాణమున్న మూడు సన్‌ఫ్లవర్ ఆయిల్ పాకెట్లు, ఒక కిలో చక్కెర ప్యాకెట్‌ను కొనుగోలు చేశాడు. చక్కెర రూ.60 ఎమ్మార్పీగా స్టిక్కర్ అతికించి వసూలు చేశారు. అందులో జీఎస్టీ తగ్గించలేదు. నూనె ప్యాకెట్‌పై ఎమ్మార్పీ ఒకటికి రూ.170 ఉండగా కేవలం రూ.1 మాత్రమే తగ్గించారు. మూడు నూనె ప్యాకెట్లకు కలిపి రూ.507 బిల్లు వసూలు చేశారు. ఇవే వస్తువులను చిన్న, చిన్న దుకాణాల్లో కొనుగోలు చేసినా అంత ధరలుండవు. ఆహార పదార్థాలపై ప్రభుత్వం జీఎస్టీ తగ్గించింది. ఇక్కడ మాత్రం ధరలు తగ్గలేదు. పాత రేట్ల ప్రకారం అమ్మారు.



ఇందిరాభవన్‌లో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ బ్రోచర్లను ప్రదర్శిస్తూ.. (ఫైల్)



మెడికల్ షాపు వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్

తగ్గని మందుల ధరలు

- పలు రకాల నిత్యావసరాలపై కూడా..
- పాత రేట్లకే విక్రయం
- వ్యాపారులకు లాభం.. వినియోగదారులకు నష్టం
- అయినా అట్టహాసంగా సంబరాలు

నెల్లూరు(అర్బన్): 'జీఎస్టీ 2.0తో ఎంతో ఉపయోగం ఉంటుంది. దేశవ్యాప్తంగా సంవత్సరానికి రూ.90 వేల కోట్లు ప్రజలకు మిగులుతుంది' అని కొద్దిరోజులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊదరగొడుతున్నాయి. ప్రజలకు భారీ స్థాయి లబ్ధి చేకూర్చామంటూ కూటమి ప్రభుత్వం కర్నూలు జిల్లాలో గురువారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ పేరుతో సభ నిర్వహించింది. ఇందులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు పాల్గొని ఉపన్యాసాలిచ్చారు. ఆ సభకు జిల్లా నుంచి కూడా 250 ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలను తరలించారు.

ప్రచార ఆర్భాటమే..

కలెక్టర్ హిమాన్షు శుక్లాతోపాటు జీఎస్టీ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌లు జీఎస్టీ 2.0 వల్ల భారీ స్థాయిలో ధరలు తగ్గుతాయంటూ కలెక్టరేట్‌లో ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారు. రోజుకోచోట సంబంధిత అధికారులు సమావేశాలు నిర్వహించి ప్రజలు భారీగా లబ్ధి పొందుతున్నారంటూ ప్రచారం చేస్తున్నారు. కొన్ని మార్ట్‌లు, మాల్స్‌ను కూడా తనిఖీ చేశామని, ధరలు తగ్గించి అమ్ముతున్నారని పేర్కొంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. బీమా, మోటార్‌బైక్‌ల కొనుగోలు లాంటి ఒకటీ అరా చోట మాత్రమే తగ్గించిన జీఎస్టీ అమలవుతోంది. పేదలు నిత్యం ఖర్చుచేసే ఆహార పదార్థాలు, మెడిసిన్స్ లాంటి వాటిలో అమలు కావడం లేదు. ఇదేమి జీఎస్టీ అంటూ నిట్టూరుస్తున్నారు. ప్రచార ఆర్భాటమే తప్ప ఆచరణలో శూన్యమని వినియోగదారులు పేర్కొంటున్నారు. నాలుగు రోజుల క్రితం జీఎస్టీ ఫలాలు పేదలు, సామాన్యులకు అందడం లేదంటూ సీపీఎం నాయకులు నగరంలో ఆందోళన నిర్వహించారు.

హాస్పిటళ్లలో ఇలా..

జిల్లాలో 450 రిజిస్టర్ హాస్పిటళ్లున్నాయి. పలుచోట్ల అనుమతి లేకుండా క్లినిక్‌లు నడుస్తున్నాయి. 1,850 వరకు రిటైల్, హోల్‌సేల్ మెడికల్ దుకాణాలున్నాయి. నగరంలోని పెద్ద, పెద్ద ఆస్పత్రుల్లో బిల్లులు పరిశీలిస్తే ఎమ్మార్పీ కన్నా తగ్గించిన జీఎస్టీ అమలు కావడం లేదు. మందుల దుకాణాల వ్యాపారుల మధ్య పోటీ వల్ల రోగులను రప్పించుకునేందుకు ఎప్పటి నుంచో డిస్కౌంట్ ఇస్తున్నారు. ఎక్కువ చోట్ల 20 శాతం ఇస్తుండగా కొన్నిచోట్ల 15 శాతంగా ఉంది. ఇప్పుడు జీఎస్టీ తగ్గినా ఆ ఫలాలు అందడం లేదు. పాతకాలం నుంచి ఇచ్చే రిబేటుతోనే సరిపెట్టుకుంటున్నారు. శివారు ప్రాంతాలు, పలు ఆస్పత్రులు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఎమ్మార్పీ కన్నా అసలు తగ్గించడం లేదు. డిస్కౌంట్ కూడా ఇవ్వడం లేదు.

36 రకాల మందులపై జీఎస్టీ లేదు

కేన్సర్, గుండె, జన్యుపరమైన తీవ్ర వ్యాధులతో బాధపడేవారికి అవసరమైన 36 రకాల మందులపై గతంలో ఉన్న 5 శాతం జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తొలగించి 0 శాతం చేసింది. గతంలో 12 శాతంగా ఉన్న మందులను కూడా 0 శాతంలోకి చేర్చింది. సాధారణ జబ్బులకు వినియోగించే మందులపై ఉన్న 12 శాతం జీఎస్టీని ఇప్పుడు 5 శాతంలోకి తీసుకొచ్చారు. మరికొన్ని మెడికేటెడ్ పేస్టులపై ఉన్న 18 శాతాన్ని నేడు 5 శాతంలోకి కేంద్రం తెచ్చింది.



వారికే లాభాలు

పలు దుకాణాల్లో నిత్యావసర సరుకులతోపాటు మందుల ధరలు తగ్గకపోవడంతో అంతిమంగా వ్యాపారులే లాభపడుతున్నారు. జీఎస్టీ అమలు చేయని వారిపై ఇప్పటి వరకు సంబంధిత శాఖ ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. ధరలు తగ్గినట్టు పేరుకు మాత్రమే బ్యానర్లు, వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రచార ఆర్భాటం వదిలి ఆచరణలో జీఎస్టీ తగ్గించని వారిపై కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

జీఎస్టీలో మార్పులతో మందుల ధరలు తగ్గాయి. మెడికల్ షాపుల వారు తగ్గించి అమ్మకాలు చేస్తున్నారు. ఎక్కడైనా ఇంకా తగ్గించకుండా అమ్మినట్టు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

– రమేష్‌రెడ్డి, ఏడీ, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ

అవగాహన కల్పిస్తున్నాం

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ పేరుతో నాలుగు వారాలు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశాం. తగ్గిన రేట్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రేట్ సింహపురి ఎలక్ట్రానిక్స్ ఫెస్టివల్ పేరుతో ఈనెల 10, 11 తేదీల్లో ఇందిరా భవన్‌లో తగ్గించిన ఎలక్ట్రానిక్స్ వస్తువుల ప్రదర్శన చేశాం. ఇలాగే పలు రకాల వస్తువులపై అవగాహన కల్పిస్తున్నాం. ధరలు తగ్గాయి. ఇంకా తగ్గించలేదనుకుంటే మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– కిరణ్‌కుమార్, జాయింట్ కమిషనర్, జీఎస్టీ

బాబుకు ప్రజలు గుణపాఠం చెబుతారు

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సంతకం చేస్తున్న సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): సీఎం చంద్రబాబుకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య, ప్రజలకు వైద్యం అందేలా గత ప్రభుత్వం మెడికల్ కళాశాలను నిర్మించారన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ సంస్థలకు అప్పనంగా అప్పగించే కుట్రకు తెరలేపిందని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబును మించిన వారు దేశంలో ఇంకెవరూ లేరని ఎద్దేవా చేశారు. తప్పు చేసిన ఏ ఒక్క అధికారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదని మరోసారి స్పష్టం చేశారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై పార్టీలతో సంబంధం లేకుండా కోటి సంతకాల కార్యక్రమానికి స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావాలన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనికి అధికారులు కూడా సమాధానం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నట్లు చెప్పారు. జనసేన నేత గూడూరు వెంకటేశ్వర్లు తప్పును ఎత్తిచూపించినందుకు ఆయనపై కూడా కేసు నమోదు చేశారన్నారు. అనంతరం రామ్‌కుమార్‌రెడ్డి మొదటి సంతకం చేసి కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ బొలిగర్ల మస్తాన్ యాదవ్, పాపకన్ను మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, మండల కన్వీనర్లు, రాష్ట్ర విభాగాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ..



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు

- విద్యుత్ భవన్ వద్ద ధర్నా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులోని విద్యుత్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హజరత్తయ్య, జాకీర్ హుస్సేన్ పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను నేరుగా వేతనాలివ్వడం ద్వారా సంస్థకు రూ.192 కోట్లు మిగులుతాయని, కానీ అందుకు భిన్నంగా యాజమాన్యం కాంట్రాక్టర్ ద్వారా చెల్లిస్తోందన్నారు. సంస్థకు నష్టమొచ్చేలా యాజమాన్యం ఎందుకు చర్యలు తీసుకుంటుందో అర్థం కావడం లేదని విమర్శించారు. గ్రేడ్ – 2 జేఎల్‌ఎంలను సర్వీసు రెగ్యులేషన్ చేయాలన్నారు. ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సంస్థను దశల వారీగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించకపోతే విద్యుత్ జేఏసీ నిర్వహించే సమ్మెకు తమ మద్దతు ఉంటుందన్నారు. సమ్మె సమయంలో కొత్త వారితో పనిచేయించుకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పెంచలప్రసాద్, గిరిబాబు, నాగయ్య, హరినారాయణ, విజయరామిరెడ్డి, నాగరాజు, మహేంద్ర, రఘు, మౌలాలి, వసంత్, మహేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు రాజా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైమ్): నిబంధనలు అతిక్రమించి బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అజిత హెచ్చరించారు. శుక్రవారం ఆమె నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విక్రయదారులు విధిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల వల్లే ప్రమాదాలను నివారించగలమన్నారు. జిల్లాలో బాణసంచా అక్రమ తయారీ, నిల్వ, విక్రయాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎక్కడపడితే అక్కడ దుకాణాలు ఏర్పాటు చేయొద్దన్నారు. తయారీ, విక్రయదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్రతను బట్టి జరిమానా, తాత్కాలిక/శాశ్వతంగా లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. బీఐఎస్ లేదా సంబంధిత నియంత్రణ సంస్థల ద్వారా నిర్దేశించబడిన ప్రమాణాలకు అనుగుణంగా టపాసులు తయారు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వలు, తయారీ సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టీచర్లను రిలీవ్ చేయాలి

నెల్లూరు(టౌన్): ఈ ఏడాది జూన్‌లో ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయా లని పలువురు డిమాండ్ చేశారు. నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద టీచర్లు చేస్తున్న ధర్నాకు మద్దతుగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ హజరత్ 48 గంటల ఆమరణ నిరాహార దీక్షను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారు 450 మంది ఉపాధ్యాయులు రిలీవర్లు లేని కారణంగా బదిలీ కాలేదన్నారు. ఎంటీఎస్ టీచర్లతో, ఆ తర్వాత డీఎస్సీ నూతన ఉపాధ్యాయులతో రిలీవ్ చేస్తామని చెప్పినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తిరుమలేష్, వెంకటరావు, మాధవి, సుమ, కుసుమ, భార్గవి, వహీదా, సర్వసతి, బ్యూలా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

పనులు పూర్తి చేయండి : జెడ్పీ సీఈఓ

నెల్లూరు(పొగతోట): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా ఎంపికైన గ్రామాల్లో మంజూరు చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆదేశించారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పనులు గుర్తించడం జరిగిందన్నారు. రూ.3 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైతే పనుల మార్పునకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ప్రస్తుతం 15 కొత్త గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక్కో గ్రామానికి రూ.20 లక్షలు నిధులు కేటాయిస్తుందన్నారు.

శ్లాబ్ కూలి.. కన్నీళ్లు మిగిలి..

- నెల్లూరులో వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సోమయ్య



దయాకర్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): అతను కుటుంబ పోషణ నిమిత్తం పనికెళ్లేందుకు తెల్లవారుజామునే నిద్ర లేచాడు. సిద్ధమై ఇంటి నుంచి బయటకు రాగా శ్లాబ్ రూపంలో మృత్యువు కబళించింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శ్లాబ్ కూలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరులోని రంగనాయకులపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సోమిశెట్టి కల్యాణ మండపం సమీపంలో ఎన్.వెంకటేశ్వర్లుకు చెందిన గృహ సముదాయంలో బొమ్మా దయాకర్ (47), లక్ష్మి దంపతులు అద్దెకుంటున్నారు. దయాకర్ స్థానికంగా టీ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోడ్డు మార్జిన్‌లో దుకాణం తొలగించడంతో కొంత కాలంగా తోపుడు బండిపై టీ విక్రయిస్తున్నాడు. రోజూ తెల్లవారుజామునే టీ తయారు చేసుకుని బండిపై పెట్టుకుని అమ్ముకునేవాడు. శుక్రవారం తెల్లవారుజామున సిద్ధమై బయటికొచ్చాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రెండో అంతస్తు సైడ్ శ్లాబ్ నానిపోయి ఉండగా అది విరిగి దయాకర్‌పై పడింది. పెద్ద శబ్దం రావడంతో భార్య, పక్క ఇళ్లలో ఉన్నవారు బయటికొచ్చిచూడగా అప్పటికే దయాకర్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. దీంతో వారు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దయాకర్‌ను పరీక్షించి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. కాసేపటి క్రితం వరకు ఇంట్లో తిరిగిన భర్త విగతజీవిగా పడి ఉండటాన్ని చూసిన లక్ష్మి కన్నీరుమున్నీరుగా రోదించింది. బాధితురాలు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్య, ఎస్సై సుల్తాన్‌బాషాలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.